ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 04-11-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- ప్రభుత్వ పరిపాలనలో భారతీయ పౌరులందరికీ పక్షపాతం లేకుండా సేవలందించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ పేర్కొన్నారు.
- ఉత్తరాఖండ్ అల్మోరా జిల్లాలో ఈరోజు జరిగిన బస్సు ప్రమాదంలో 36 మంది మరణించారు.
- గిరిజన ప్రజల ఆకాంక్షలు, ఆత్మగౌరవం భారతీయ జనతా పార్టీకి అత్యంత ముఖ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు.
- దేశ వ్యాప్తంగా 37.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యంతో 50 సోలార్ పార్కులను ఏర్పాటు చేయనున్నామని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.
- భారత వైమానిక దళానికి చెందిన మిగ్-29 యుద్ధ విమానం ఉత్తరాఖండ్ లోని ఆగ్రా సమీపంలో ఈరోజు కూలిపోయింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ అల్మోరా జిల్లాలో ఈరోజు జరిగిన బస్సు ప్రమాదంలో 36 మంది మరణించారు. ఈరోజు ఉదయం 8 గంటల 30 నిముషాల సమయంలో 50 మందికి పైగా ప్రయాణికులతో బస్సు గర్వాల్ నుంచి రాంనగర్ కు వెళ్తుండగా అల్మోరాలోని కూపి గ్రామ సమీపంలో లోయలో పడి ప్రమాదం చోటు చేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే 28 మంది ప్రయాణికులు మరణించగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరో ఎనిమిది మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున ప్రధానమంత్రి సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందజేస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ స్పందిస్తూ సహాయక చర్యలు వేగంగా నిర్వహించాలని తీవ్రంగా గాయపడిన వారిని వాయుమార్గంలో తరలించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ పరిపాలనలో జాతీయవాదం యొక్క విలువలకు కట్టుబడి భారతీయ పౌరులందరికీ పక్షపాతం లేకుండా సేవలందించాలని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖర్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ (IIPA) 70వ వార్షికోత్సవంలో ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ విధాన రూపకల్పనలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం వల్ల సున్నితమైన సమర్ధవంతమైన పాలనను అందించవచ్చని పేర్కొన్నారు.

(వాయిస్ బైట్.. జగదీప్ ధనఖర్).. (25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గిరిజన మహిళల సాధికారత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వ పథకాలను రూపొందిస్తున్నామని భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. దేశ అభివృద్ధిలో భాగంగా మహిళా సాధికారత కోసం ఇటీవల విడుదల చేసిన జార్ఖండ్ బీజేపీ ఎన్నికల మానిఫెస్టోలో మహిళా శక్తికి అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఝార్ఖండ్ అసెంబ్లి ఎన్నికల ప్రచారంలో భాగంగా గర్వాలోని చేత్నా మైదానంలో జరిగిన బహిరంగ సభలో నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ బీజేపీకి గిరిజన ప్రజల ఆకాంక్షలు, ఆత్మగౌరవం అత్యంత ముఖ్యమని తొలిసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అటల్ బిహారీ వాజ్ పేయి నేతృత్వంలో గిరిజన సమాజానికి ప్రత్యేక రాష్ట్రం లభించిందని గుర్తు చేశారు.

(వాయిస్ బైట్.. ప్రధాన మంత్రి).. (32 సెకన్లు)

కాగా ఝార్ఖండ్ అసెంబ్లి ఎన్నికలు ఈ నెల 13,20 తేదీల్లో రెండు దశల్లో జరగనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వైమానిక దళానికి చెందిన మిగ్-29 యుద్ధ విమానం ఉత్తరాఖండ్ లోని ఆగ్రా సమీపంలో ఈరోజు కూలిపోయింది. సాంకేతిక లోపం తలెత్తడంతో జరిగిన ఈ ఘటనలో పైలట్ సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. రాజస్థాన్ లోని బార్మర్ లో గత నెలలో కూడా ఇలాంటి ప్రమాదమే జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కెనడాలోని బ్రాంప్టన్‌లో హిందూ ఆలయం వద్ద నిన్న వేర్పాటువాదులు జరిపిన హింసాత్మక చర్యలను భారత్ ఖండించింది. కెనడాలోని భారతీయ పౌరుల భద్రత గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అటువంటి దాడుల నుండి అన్ని ప్రార్థనా స్థలాలను రక్షించాలని కెనడా ప్రభుత్వాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కోరారు. హింసకు పాల్పడే వారిపై కెనడా విచారణ చేపడుతోందని భారత్ భావిస్తోందని ఆయన అన్నారు.

===========================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ వ్యాప్తంగా 37.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యంతో 50 సోలార్ పార్కులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక శక్తి శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు భారత్ అధ్యక్షత వహిస్తున్న అంతర్జాతీయ సౌర కూటమి (ISA) ఏడవ సెషన్ లో ఆయన ప్రారంభ ఉపన్యాసం చేశారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే లక్ష్యంలో భాగంగా భారత్ ఇప్పటికే 90 గిగావాట్ల సౌర సామర్థ్యాన్ని చేరుకుందని మంత్రి ప్రహ్లాద్ జోషి వెల్లడిస్తూ....

(వాయిస్ బైట్.. ప్రహ్లాద్ జోషి).. (27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండోనేషియా దేశంలోని తూర్పు ప్రాంతంలో ఈరోజు వరుస అగ్నిపర్వత విస్ఫోటనాలు సంభవించాయి. చుట్టుపక్కల గ్రామాలపై ఈ విస్ఫోటనాలు లావా, బూడిదను వెదజల్లడంతో పలు ఇళ్లు దగ్ధమయ్యాయి. దీంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. ఫ్లోర్స్ ద్వీపం యొక్క ఆగ్నేయ భాగంలో ఉన్న మౌంట్ లెవోటోబి లకీ-లాకీ విస్ఫోటనం చెందిందని, 12కు పైగా భూకంపాలు సంభవించాయని విపత్తుల నిర్వహణ అధికారులు తెలిపారు. కాగా ఇండోనేషియా లోని వేలాది ద్వీపాలు రింగ్ ఆఫ్ ఫైర్ వెంబడి ఉంటాయి. అక్కడ పసిఫిక్ మహాసముద్రం ఉపరితలం కింద టెక్టోనిక్ ప్లేట్లు తరచూ ఘర్షణకు గురవుతాయి. వీటి కారణంగా భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు ఏర్పడతుంటాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్ జైశంకర్ అమెరికా పర్యటనలో భాగంగా ఈరోజు క్వీన్స్ ల్యాండ్ గవర్నరు జెన్నెట్ యంగ్ ను కలిశారు. ఇరువురు బ్రిస్బేన్ లో భారత కాన్సులేట్ జనరల్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రి జైశంకర్ మాట్లాడుతూ  భారత కాన్సులేట్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందని క్వీన్స్ ల్యాండ్ రాష్ట్రంతో భారత్ సంబందాలు బలోపేతం చేయడానికి ఇది ఉపయోగపడుతుందని అన్నారు. వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి, విద్యా సంబంధాలను పెంపొందించడానికి, ప్రవాస భారతీయులకు సేవలందించడానికి ఇది మరింత దోహదం చేస్తుందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్.. జై శంకర్).. (34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 79,713  పాయింట్ల వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమై 941 పాయింట్ల నష్టంతో 78,782 వద్ద ముగిసింది. నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 23,995.35 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠమైన 84.11 స్థాయికి చేరింది. ఇదిలా ఉండగా పండగలు, వివాహాది శుభకార్యాల నేపథ్యంలో ఇటీవల పెరిగిన బంగారం, వెండి ధరలు ఈరోజు కొద్దిగా తగ్గాయి. దేశ రాజధాని దిల్లీలో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.13వందల మేర తగ్గి రూ.81 వేల ఒక వందకు చేరింది. ఇటీవల లక్ష రూపాయల మార్కు దాటిన కిలో వెండి ధర సైతం ఈరోజు రూ.4600 తగ్గి రూ.94,900కు చేరింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ లోని రాజ్ గిర్ లో నవంబర్ 11 నుంచి 20 వరకు జరగనున్న మహిళల ఆసియా హాకీ చాంపియన్ షిప్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారత మహిళల హాకీ జట్టు ఈరోజు గయకు చేరుకుంది. కెప్టెన్ సలీమా టెటే నేతృత్వంలోని 18 మంది సభ్యుల భారత జట్టుకు సంప్రదాయ పద్ధతిలో ఘనస్వాగతం లభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =